Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143




Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 285 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :285 | బుధవారం 15 అక్టోబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4



## 299 చెరువులకు కృష్ణా జలాలు

- హంద్రీనీవాతో రాయలసీమకు జలసిరి
- సకాలంలో హంద్రీనీవా పనులు పూర్తి చేసిన అధికారులకు కితాబు
- మిగిలిన 218 చెరువులను ఫిబ్రవరిలోగా నీటితో నింపుతాం
- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, కర్నూలు**

హంద్రీనీవా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని మొత్తం 517 చెరువులకు గాను 299 చెరువులని కృష్ణాజలాలతో నింపామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. హంద్రీ నీవా నీరుతో చెరువులు నింపే కార్యక్రమానికి సంబంధించి కర్నూలు ఇరిగేషన్ సిఈ కార్యాలయంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు సకాలంలో పూర్తి చేసిన అధికారులను - మిగతా3లో

## విశాఖలో దేశంలోనే తొలి అతిపెద్ద

# ఏఐ డేటా హబ్

- విశాఖ నుంచే ప్రపంచ దేశాలకు అనుసంధానం
- సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రుల సమక్షంలో ప్రకటించిన గూగుల్
- ఏర్పాటుపై ఎక్స్ వేదికగా ప్రకటించిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్
- విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- డేటా సెంటర్ విశాఖకు రావటం గర్వకారణం: సీఎం చంద్రబాబు
- సీఎం చంద్రబాబు, లోకేష్‌కు అభినందలు వెల్లువ



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ**

దేశంలోనే విశాఖలో తొలి అతిపెద్ద ఏఐ డేటా హబ్ ఏర్పాటు కాబోతోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఆంధ్రప్రదేశ్ సువర్ణ అధ్యాయం లిఖించింది. ప్రపంచాన్ని శాసిస్తున్న డేటా, ఏఐ లాంటి రంగాల్లో విశాఖ నగరం కేంద్ర బిందువు కానుంది. ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖ వేదికగా భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించింది. అమెరికా వెలుపల అతిపెద్ద ఏఐ డేటా హబ్ ను విశాలో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. ఈమేరకు ఢిల్లీలో జరిగిన భారత్ ఏఐ శక్తి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు కోసం రానున్న ఐదేళ్ల కాలంలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టనున్నట్టు గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ ప్రకటించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ' వచ్చే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాలని గూగుల్ నిర్ణయించడం సంతోషం కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ పెట్టుబడి భారత డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లో ఒక కొత్త - మిగతా3లో



## కదులుతున్న బస్సులో మంటలు

- 12 మంది ప్రయాణికులు సజీవ దహనం..!
- కదులుతున్న బస్సులో మంటలు చెలరేగాయి
- కొద్ది నిమిషాల్లోనే బస్సంతా మంటలు వ్యాపించాయి.
- దాదాపు 20 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత, బస్సు వెనుక నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి



## సమాఖ్య వ్యవస్థకు ఏమైంది?

- ఈడీపై సుప్రీం మరోసారి సీరియస్
- "రాష్ట్ర పోలీసుల హక్కులను ఉల్లంఘించడం లేదా?
- మీకు అనుమానం వచ్చినప్పుడల్లా మీ సొంతంగా దర్యాప్తు చేస్తారా?
- ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయడం లేదా?

## బీజేపీ తొలి జాబితా రెడీ

- అంతా ఊహించినట్లుగానే బీజేపీ 101 స్థానాల్లో పోటీకి సిద్ధమవుతోంది
- ఈ నేపథ్యంలోనే భారతీయ జనతా పార్టీ మంగళవారం (అక్టోబర్ 14) ఎన్నికలకు తన మొదటి జాబితాను విడుదల
- జాబితా ప్రకారం, నంద్ కిషోర్ యాదవ్‌కు నిరాశ ఎదురైంది
- ఈ జాబితాలో మొత్తం 71 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది కమలం పార్టీ




## అందుకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే

- బీహార్ రాజకీయ పార్టీలకు ఈసీ ఆదేశం
- ఎన్నికల ప్రచార ప్రకటనలకు పార్టీలు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచన
- రాజకీయ ప్రచారాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం కోసం ఈ చర్యలు




# ఏఐతో విక్షిత్ భారత్‌కు ముందడుగు



- విక్షిత్ భారత్‌కు విశాఖ గూగుల్ డేటా సెంటర్ గొప్ప ముందడుగు
- యువత, రైతులు, వైద్యులు, మత్స్యకారులు, మహిళలు విద్యార్థుల జీవితాలను ఏఐ ప్రభావితం చేస్తుంది
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ విక్షిత్ భారత్ కోసం నిరంతరాయంగా చేస్తున్న కృషి
- భారత్‌లో ఏఐ హబ్‌ను నిర్మించడానికి ప్రతి పౌరుడి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఈ సాంకేతికతను ఉపయోగించుకోవడానికి ఇది మన సమష్టి క్షణం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

గమ్యస్థానం నుంచి 'విక్షిత్ భారత్'కు మార్గం ఇప్పుడు సుగమం అవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. విశాఖపట్నం 15 బిలియన్ల గూగుల్ ఏఐ డేటా సెంటర్‌ను భారతదేశపు మొట్టమొదటి ఏఐ నగరాన్ని పొందడం గొప్ప ముందడుగని అభివర్ణించారు. ఈ చొరవ అందరికీ ఏఐ శక్తి నిజంగా తెలుస్తుందని ఉద్ఘాటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు పవన్ కల్యాణ్. యువత, రైతులు, వైద్యులు, మత్స్యకారులు, మహిళలు విద్యార్థుల జీవితాలను ఏఐ ప్రభావితం చేస్తుందని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విక్షిత్ భారత్ కోసం నిరంతరాయంగా చేస్తున్న కృషి.. ఆయన దార్శనికత సృష్టించిన ప్రపంచ విశ్వాసం ప్రత్యక్ష ఫలితం ఇదని - మిగతా3లో



## 15 మిలియన్ డాలర్ల పెట్టుబడి

- మోడీతో మాట్లాడిన పిచాయ్
- భారత్ నుంచి ఆసియా దేశాలకు సేవలు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య ఢిల్లీలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి
- గూగుల్ ఏఐ హబ్ వల్ల పెద్ద ఎత్తున క్లీన్ ఎనర్జీ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి

## ఆ భయంతోనే చంద్రబాబు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు

- 'భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి మద్యం అసలుదా.. నకిలీదా అని తెలుసుకునేలా యాప్ పెట్టలేదు
- చంద్రబాబు యాప్ పెట్టారంటే నకిలీ మద్యం ఉన్నట్లే కదా?
- చంద్రబాబు తప్పుల మీద తప్పులు చేస్తూ కూడా అడ్డంగా బుకాయిస్తున్నారు
- సడెన్‌గా ఒకడు ఆఫ్రికానుంచి వస్తాడు, అతనికి రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతారు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు పెట్టాం
- ఆ దుకాణాలకు వచ్చిన మద్యం ఏ డిస్టిలరీ నుంచి వచ్చిందో తెలుసేలా చేశాం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్,తాడేపల్లి**

నకిలీ మద్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డగోలుగా బరితెగించి వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు తప్పులు మీద తప్పులు చేస్తూ కూడా అడ్డగోలుగా బుకాయిస్తున్నారని విమర్శించారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శులతో సజ్జల సమావేశమయ్యారు. 'భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి మద్యం అసలుదా.. నకిలీదా అని తెలుసుకునేలా యాప్ పెట్టలేదు. చంద్రబాబు యాప్ పెట్టారంటే నకిలీ మద్యం ఉన్నట్లే కదా..?, చంద్రబాబు తప్పుల మీద తప్పులు చేస్తూ కూడా అడ్డంగా బుకాయిస్తున్నారు. సడెన్‌గా ఒకడు ఆఫ్రికానుంచి వస్తాడు, అతనికి రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతారు. అతని వీడియో బయటికి - మిగతా3లో




## కాంగ్రెస్ కూటమికి మజ్లీస్ షాక్

- గత ఎన్నికల్లో ఓట్లు చీల్చి హస్తం కూటమికి గట్టి ఝలక్ ఇచ్చిన మజ్లీస్
- ఎంఐఎం ప్రకటించిన 32 స్థానాలు మొత్తం 16 జిల్లాలకు చెందినవి
- ముఖ్యంగా ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న సీమాంచల్ ప్రాంతంపై ఆ పార్టీ ప్రధానంగా దృష్టి సారించింది

### లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు గ్రహీత

# శివమూర్తికు ఘన సన్మానం.

### ఘనంగా సన్మానించిన రేణిగుంట ప్రెస్ క్లబ్ కార్యవర్గం

**రేణిగుంట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 14 :**



ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రప్రభ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జ్, రేణిగుంట ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివమూర్తిని రేణిగుంట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కందుకూరి మురళి రాయల్ ఆధ్వర్యంలో ప్రెస్ కార్యవర్గం సభ్యులు శాలువాతో సన్మానించి పూలమాలతో ఘనంగా సత్కరించారు. శివమూర్తి మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమ కోసం పాటుపడే నాయకుడు ఆశయం గల వ్యక్తి రేణిగుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కందుకూరి మురళి రాయల్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉత్తమమైన స్థానంలో నిలుస్తుందన్నారు. నన్ను సన్మానించినందుకు రేణిగుంట ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో వినోద్, జలీల్, రాజశేఖర్, రమేష్, కిరణ్, హరీష్, మధు, గరుడ మురళి, బాలు, మహమ్మద్, అప్సర్, నాగూర్, సంకేష్, కన్నయ్య, బిన్నీ పాల్గొన్నారు.

## చిత్తూరు కోర్టుకు హాజరైన కుప్పం టిడిపి నేతలు



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**

చిత్తూరు జిల్లా కోర్టుకు మంగళవారం కుప్పం టిడిపి నేతలు హాజరయ్యారు. ప్రతిపక్ష నేతగా నారా చంద్రబాబు నాయుడు రామకుప్పం మండలం కొల్లుపల్లిలో పర్యటించినప్పుడు చోటు చేసుకున్న ఘటనలు నేపథ్యంలో టిడిపి నేతలపై పలు కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి కుప్పం నియోజకవర్గ టిడిపి నాయకులు చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. త్వరలో తమకు న్యాయం జరుగుతుందన్న దృఢ సంకల్పం వ్యక్తపరిచారు.

### జిల్లా పర్యాటక అభివృద్ధికి

# సంబంధిత అధికారులు కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**



జిల్లా పర్యాటక అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేసి జిల్లాను పర్యాటక రంగంలో ముందంజలో ఉంచే విధంగా సంబంధిత యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టరేట్, జిల్లా పర్యాటక మండలి చైర్మన్ సుమిత్ కుమార్ డిఆర్ఓ మోహన్ కుమార్ ఆర్డిఓ శ్రీనివాసులు పర్యాటకశాఖ ఆర్డి రవణ ప్రసాద్ దేవదాయ శాఖ సహాయక కమిషనర్ చిట్టెమ్మ, జిల్లా పర్యటక అధికారి నరేంద్ర కుమార్‌లతో జిల్లా పర్యాటక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యాటక అభివృద్ధికి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. ఇందులో భాగంగా కైగల్ జలపాతం, పులిగుండు కంగుంది, మొగిలి దేవాలయాలలో తీసుకోవాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. అనంతరం ఐరాల బుగ్గమడుగు జలపాతం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్బరాజాతో చర్చించారు.

### కుప్పం షాది మహల్ చైర్మన్

# సర్దార్ భాషకు సత్కరించిన

### మైనార్టీ సోదరులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 14:**

తెలుగుదేశంపార్టీ సీనియర్‌నేత సర్దార్ భాషను కుప్పం షాది మహల్ చైర్మన్‌గా ఎన్నుకోవడం పై ఆనందం వ్యక్తం చేస్తూ యువ నాయకులు మతీన్, టిడిపి నేత అజీమ్, సామాజిక కార్యకర్తలు ఖలీం, ఫైరోజ్‌లు సర్దార్ భాషను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ముందుగా తనను నమ్మి పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నంకు, కుప్పం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు జాకీర్ అహ్మద్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనను సన్మానించి అభినందనలు తెలిపిన టిడిపి కుటుంబ సభ్యుల అభిమానాన్ని ఎన్నటికీ మరిచిపోలేమని, పార్టీ అధినేత నమ్మకాన్ని కాపాడుకుంటూ, సాటి నాయకుల అభిమానాన్ని నిలుపుకునేలా తమ పదవీ బాధ్యతలను నిర్వహిస్తామన్నారు.

### ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం

### ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి.



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**

అన్నమయ్యజిల్లా పీలేరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరగను న్నట్లు పీలేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమ్మూర్తి తెలిపారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొంటున్నారు. ప్రభు త్వం ప్రవేశ పెట్టినటువంటి సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలపై ఈ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు.

### 31,929 మంది మామిడి రైతుల ఖాతాలకు

# రూ.146.84 కోట్లు సబ్సిడీ జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**20 వేల మందికి పైగా రైతులకు లక్ష రూపాయలకు మించి సబ్సిడీ జమ**

**అర్హత ఉండి సబ్సిడీ జమ కాని రైతులకు అక్టోబర్ 30 లోపు వినతులు సమర్పించవచ్చు**

**ప్రభుత్వం ప్రకటించిన ధరలను మామిడి రైతులకు చెల్లించని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వం సహకరించదు**

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఌఅక్టోబర్ 14:**



మామిడి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలోని 31,929 మంది రైతుల ఖాతాలకు రూ.146.84 కోట్లు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మామిడి రైతులకు సబ్సిడీ పై జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ పాత్రికేయుల సమా వేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మామిడి రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4 సబ్సిడీ ప్రకటించిన ప్రకారం జిల్లాలో 31, 929 మంది రైతులకు సంబంధించి 3.67 లక్షల మెట్రిక్ టన్నుల మామిడికి రూ. 146.84 కోట్లు డిబిటి పద్ధతిలో నేరుగా రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఇందులో బంగారుపాలెం మండలానికి చెందిన రైతుల కు ఎక్కువ మొత్తం జమ అయ్యిందని, జిల్లాలో 20 వేల మందికి పైగా రైతులకు లక్ష రూపాయలకు మించి సబ్సిడీ జమ కావడం జరిగిందన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల లో లేని విధంగా మామిడి రైతులకు సబ్సిడీ మరియు మద్దతు ధరలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందించిందని, రైతులకు అండ గా నిలిచిన ప్రభుత్వానికి జిల్లా మామిడి రైతాంగం తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్, క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం సబ్సిడీ పరంగా ఖచ్చితమైన నిర్ధారణకు రావడం జరిగిందన్నారు. అర్హత కలిగి నగదు జమకాని రైతు లు ఆందోళన చెందనవసరం లేదని అక్టోబర్ 30వ తేదివరకు తమ వినతులను ఆర్ ఎస్ కె,మండల, జిల్లా స్థాయి ఉద్యాన అధికారులకు సమర్పించవచ్చునని, వారి అర్హతను 48 గం. లలో నిర్ధారించడం జరుగుతుందన్నారు. రూ.5లక్షలకు మిం చి సబ్సిడీకి సంబంధించి 21 మంది రైతులు ఉన్నారని, వీరి అర్హతను పరిశీలించి నగదు జమ చేస్తామన్నారు. గుడిపాల, పుంగనూరు, బంగారుపాళెంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరలను మామిడి రైతులకు అందించని కారణంగా ప్రభుత్వం పరంగా పరిశ్రమల శాఖ నుండి ఎటువంటి సహకారం అందించడం జరగదని, రైతుల కు మేలు చేసే పరిశ్రమలకు మరింత ప్రోత్సాహకాలు, సహకారం అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కేవలం రాజయకీయంగా, వ్యాపారపరంగా మాత్రమే కాకుండా రైతుల సంక్షేమాన్ని కూడా కొంత వరకు దృష్టిలో ఉంచుకుని పని చేయాలని తెలిపారు.

## మున్సిపల్ కమిషనర్ - చైర్మన్‌లను సత్కరించిన కౌన్సిలర్లు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**

కుప్పం మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లు,రెస్కో డైరెక్టర్ శివ,ఆర్ముగం, టీడీపీ నాయకులు దయాకర్, దేవ, లోకనాథ్, హరి, శారదమ్మ,ముఖ్య నాయకులు స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రా కార్యక్రంలో భాగంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు అందు కున్న శ్రీనివాసరావుని,కుప్పం మున్సిపల్ చైర్మన్ వి సెల్వ రాజ్‌ని సత్కరించారు. కుప్పం మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపా లిటీగా తీర్చిదిద్దేందుకు కమిషనర్, చైన్ ఎంతగానో కృషి చేస్తున్నారని కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ దాము, సోము, గణపతి, సురేష్, వేలు, కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్ర వన్యకుల క్షత్రియ డైరెక్టర్ వేణు, తదితరులు అభినందించారు.

# నకిలీ మద్యం పై వైసీపీ నిరసనగలం




**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**

అన్నమయ్యజిల్లా పీలేరు తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తున్నటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాజీ శాసన సభ్యులు, చింతల రామచంద్రారెడ్డి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబెర్ (పిసిఏ) నాయకత్వంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు.పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీగా పీలేరు ఎక్సైజ్ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కూటమి ప్రభుత్వ కల్తీ మద్యం విధానాల్ని నిరసిస్తూ ఎక్సయిస్ ఆఫీసర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ దండు జగన్ మోహన్ రెడ్డి,ఎంపీపీ కంభం సతీష్ కుమార్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు ఎటిరత్న శేఖర్‌రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకులు సుంకర్ చక్రధర్,మహితఆనంద్, హరిత,ఉదయ ఆనంద,షాకీర్, నరసింహారెడ్డి, పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా, వెంకటరమణారెడ్డి మంచూరి మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ అమరనాథ్ రెడ్డి, షబ్బీర్,నీరజ చంద్రా రెడ్డి, నరేంద్ర రెడ్డి, వినోద్, సాంబశివారెడ్డి విక్టరీ, వెంకటరమణారెడ్డి, అభిద్,మల్లి కార్జున రెడ్డి,మల్లెల శ్రీనాథ రెడ్డి, పరమేష్, మునీర్, భువనేశ్వర రెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, లోకనాథ్ రెడ్డి,లక్ష్మి రెడ్డి, కాలనీ చిన్న, విజయ్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చారాల ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన

# జిల్లా గణాంక అధికారి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**

మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య గణాంకాధికారి జార్జి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మాత శిశు మరణాలను అరికట్టాలన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భవతులను గుర్తించి వారూ జన్మించబోయే శిశువు ఆరోగ్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు అందుకోసం ఆరోగ్యం పౌష్టికాహారం పై గర్భవతులు బాధితులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా అధిక ప్రమాదం స్థితిలో ఉన్న గర్భవతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సందర్శించి అందరి ఆరోగ్య భద్రత బాధ్యతలు తీసుకొని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విలేజ్ క్లినిక్‌లో జరుగుతున్న పలు ఆరోగ్య విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రామ్మోహన్ ఏఎన్ఎంలు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌లో

# మెరిసిన రెయిన్బో స్కూల్ విద్యార్థులు

### ఆత్మవిశ్వాసంతో అద్భుత ప్రదర్శన




**రేణిగుంట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్14 :**

రేణిగుంటలోని రెయిన్‌బో స్కూల్‌లో మంగళ వారం "స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 4వ, 5వ తరగతి విద్యార్థులు తాము తరగతి గదిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను, ప్రాజెక్టులను తమ తల్లిదండ్రుల ముందు ఎంతో ఆత్మవిశ్వాసంగా ప్రదర్శన రూపంలో వివరించారు. తమ పిల్లలు ధైర్యంగా, స్పష్టంగా మాట్లాడడం చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ తరహా కార్యక్రమాలు పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆత్మ విశ్వాసం పెంపొందించడంలో ఎంతో దోహదం చేస్తాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ పి.అతావుల్లా ఖాన్ మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థుల ప్రతిభ,భావ వ్యక్తీ కరణ నైపుణ్యాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా విద్యార్థులను సన్నద్ధంచేయడమే రెయిన్‌బో స్కూల్ లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయుల కృషిని, విద్యార్థుల ప్రతిభను,తల్లిదండ్రుల సహ కారాన్ని ఆయన అభినందించారు. రెయిన్‌బో గ్రూప్ పాఠశా లలు ప్రతి విద్యార్థిలోని సామ ర్థ్యాన్ని గుర్తించి, బాధ్యతాయుతంగా, ఆత్మవిశ్వాసంతో కూడిన భవిష్యత్ పౌరులను తీర్చిదిద్దేందు కు కృషి చేస్తున్నాయని ఆయన అన్నారు.

### గాయపడిన తెలుగుదేశం కార్యకర్తని

# పరామర్శించిన బొజ్జల రిషితా రెడ్డి

**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14 :**



ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త తేజ నాయుడును ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి మంగళవారం పరామర్శించారు. ప్రైవేట్ హాస్పిటల్లో ఐసీయూ విభాగం చికిత్సలో తేజ నాయుడు ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నుండి అడిగి తెలుసుకున్న రిషితారెడ్డి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను ధైర్యం చెబుతూ, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రిషితారెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు పార్టీ బలానికి మూలస్తం భాలని, వారి సేవలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్య కర్త తేజ నాయుడు కుటుంబ సభ్యులు, స్థానిక తెలుగుదేశం నాయకులు ఆమె ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, కిరణ్, చినబాబు, జయ, ధనంజయ నాయుడు, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

### యువతకు ప్రోత్సాహంగా 7వ వార్డు వడ్డేపల్లిలో బ్రేక్ డాన్స్ కళాకారులకు

## ఆర్థిక సాయం అందించిన 11వ క్లస్టర్ ఇన్చార్జి కన్నన్

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 14:**



కుప్పం పట్టణంలోని 7వ వార్డు వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన యువత బ్రేక్ డాన్స్‌కళలో రాణి స్తూ ఇప్పటికే పలు ప్రదర్శనల ద్వారా స్థానికంగా మంచి గుర్తింపు పొందుతున్నారు. యువతలో ఉన్న ప్రతిభను గుర్తించిన టిడిపి నాయకులు, 11వ క్లస్టర్ ఇన్చార్జి కన్నన్ వారిని వ్యక్తిగతంగా కలుసుకుని ప్రోత్సాహకంగా ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కన్నన్ మాట్లాడుతూ యువత తమ ప్రతిభను సానుకూల దిశలో వినియోగించుకు ని, కుప్పం పేరు మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. బ్రేక్ డాన్స్ లాంటి ఆధునిక కళారూపాల్లో యువత పాల్గొనడం ఆనందకరమని, భవిష్యత్తులో ఇలాంటి ప్రతిభావంతులైన కళాకారులకు మరింత సహకారం అందిస్తామని తెలిపారు. స్థానికులు యువ కళాకారులను అభినందిస్తూ, యువతకు ఇలాంటి ప్రోత్సాహం అందించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# విశాఖలో దేశంలోనే తొలి అతిపెద్ద ఏఐ డేటా హబ్



-మొదటిపేజీ తరువాయి

అధ్యాయం. దేశంలో మొదటి గిగావాట్%-%స్కేల్ డేటా సెంటర్ విశాఖకు రావటం ఏపీకి గర్వకారణం. రియల్ టైమ్ డేటా, హిస్టారికల్ డేటాల సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని భారత్ వేగంగా అందిపుచ్చుకుంటుంది. ఏపీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ను ప్రతీ కుటుంబానికీ దగ్గర చేసేలా ప్రయత్నిస్తాం. హైటెక్ సిటీ నిర్మాణంతో హైదరాబాద్ దశ మారింది. ఇప్పుడు విశాఖలో ఏఐ డేటా హబ్ రాకతో ఏపీ దశ మారుతుంది. ప్రధాని మోదీ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకుంటారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు గురించి చెప్పగానే ఆయన వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గ్లోబల్ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించే విషయమై ఆలోచన చేశారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు సహకరించిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ లకు ధన్యవాదాలు. ఇంతటి భారీ పెట్టుబడిని ఏపీకి తీసుకురావటంలో ప్రధాన పాత్ర పోషించిన ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు అభినందనలు‘ అని ముఖ్యమంత్రి అన్నారు. విశాఖలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేయబోతున్నట్టు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ కెపాసిటీ, సబ్ సీ గేట్ వే సహా భారీ స్థాయి ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు కోసం 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్టు తెలిపారు. దేశ ప్రగతిలో ఈ పెట్టుబడి, ఏఐ డేటా సెంటర్ కీలకంగా మారబోతున్నట్టు సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రధాని మోదీతో మాట్లాడినట్టు సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. దేశంలో డేటా సెంటర్ పాలసీ ద్వారా ఈ తరహా డేటా సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయని అన్నారు. ఏఐ డేటా హబ్ ఏర్పాటుతో గ్లోబల్ కనెక్టివిటీ హబ్ గా విశాఖ మారుతుందని గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ వ్యాఖ్యానించారు. ఈ డేటా సెంటర్ ద్వారా వివిధ సంస్థలకు సరైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. భారత్ తో పాటు వివిధ దేశాలను అనుసంధానించేందుకు విశాఖలోని డేటా హబ్ వేదిక అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు , రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఎంపి లుగూగుల్ సంస్థ ప్రతినిధులు పాల్గోన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా 2030 నాటికి గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని భారత కరెన్సీలో (రూ.1.33 లక్షల కోట్లు) విశాఖలో పెట్టనుంది. అమెరికా వెలుపల ప్రపంచంలోనే భారీ పెట్టుబడిగా గూగుల్ సంస్థ స్పష్టం చేసింది. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ సామర్ధ్యంతో ఏఐ డేటా హబ్ ను గూగుల్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. గూగుల్ జెమిని ఏఐ, గూగుల్ సెర్చ్, గూగుల్ వర్క్ స్పేస్ , యూట్యూబ్, క్లౌడ్, జీమెయిల్ లాంటి సేవలను ఈ హబ్ ద్వారా అందించనుంది. భారత్ దేశంతో పాటు దక్షిణాసియా దేశాలైన సింగపూర్, మలేసియా సహా ఆస్ట్రేలియా లాంటి దేశాలకు విశాఖ ఏఐ డేటా హబ్ నుంచే గూగుల్ సేవలు అందనున్నాయి. మొత్తంగా విశాఖ నుంచి 12 దేశాలకు కనెక్టివిటీ ఏర్పాటు చేసుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను గూగుల్ సమకూర్చుకోనుంది. ఇందులో భాగంగా సబ్ సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ నిర్మిస్తోంది. రెండు మిలియన్ మైళ్ల కంటే పొడవైన సబ్ సీ కేబుల్ ద్వారా ప్రపంచానికి కనెక్టివిటీ కేంద్రంగా విశాఖ మారనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గూగుల్ యూజర్లకు మరింత వేగంగా సేవలు అందించేలా ఈ ఏఐ డేటా హబ్ సేవలు అందించనుంది.

**సీఎం చంద్రబాబు, లోకేష్‌కు అభినందలు వెల్లువ**

ఢిల్లీలో గూగుల్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం అమరావతి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, నేతలు ఘనస్వాగతం పలికారు. థాంక్యూ సీఎం సార్, గూగుల్ కమ్స్ టు ఏపీ నినాదాలతో కూడిన ప్లకార్డులతో నేతలు స్వాగతం పలికారు. ఏపీకి గూగుల్ సంస్థను తీసుకొచ్చేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## 22 ఏ కిందకు ఎకరాల భూమి

# అమ్మకోలేరు.. వాడుకోలేరు



**ఏలూరు :** కొరందరికీ ఎకరాల కొద్దీ భూమి ఉంది. కానీ ఏదైనా అత్యవసం అయితేనో.. ఆడబిడ్డకో ఇవ్వలేరు.. వారసులకు పంచలేరు. చుట్టూ నీరున్నా.. తాగడానికి పనికి రాదు అన్న చందంగా ఉంది వారి పరిస్థితి. ఎకరాల కొద్దీ భూములున్నా అవన్నీ 22ఎ(నిషేధిత ఆస్తుల) జాబితాలో ఉండటంతో.. ఇటు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేక భూ యజమానులు నరకం చూస్తున్నారు. అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధుల భూములు చేతులు మారినా.. గత ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌లో పెట్టి అమ్మకాలు ఆపేసింది. సుమారు 15 వేల ఎకరాల భూములు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి.భూమి ఉంటే మనిషికి కొండంత భరోసా. ఎంత పెద్ద కష్టం వచ్చినా సరే.. తీర్చుకోవచ్చు అనే ధీమా ఉంటంది. చిన్న చిన్న అక్కర్లకు అయితే భూమిని తాకట్టు పెట్టి రుణం పొందవచ్చు. పెద్ద సమస్య వస్తే.. భూమిని అమ్ముకుని కష్టం నుంచి బయపడవచ్చు. ఆడబిడ్డ పెళ్లికి కట్నంగా కూడా ఇవ్వొచ్చు. భూమి ఉంటే మనిషికి తల్లి దగ్గర ఉన్నంత భరోసా ఉంటుంది. కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే రైతులది విచిత్రమైన పరిస్థితి. వారందరి పేరు మీద వేల ఎకరాల భూములున్నా.. వారికి అక్కరకు రాకుండా పోతున్నాయి. పోని వారసులకు పంచుదామా అంటే దానికి వీలు లేకుండా ఉంది. అసలేంటి సమస్య అంటే..పశ్చిమ గోదావరి జిల్లాలోని చాలా మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. వారి పేరు మీద ఎకరాల కొద్దీ భూములున్నా.. ఇటు ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేని దుస్థితిలో ఉన్నారు. కారణం వారి భూములు 22ఎ జాబితాలో ఉండటం. అదేలా జరిగింది అంటే.. ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్స్ ఈ జాబితాలోకి వస్తాయి. ఈ భూములను అమ్ముకోలేరు.. వారసులకు పంచలేరు.మండలంలో అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులకు కేటాయించిన భూములను కొందరు అమ్ముకున్నారు. ఈ భూములు పలుమార్లు చేతులు మారాయి. అయితే గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టింది. వాటి అమ్మకాలు, కొనుగోళ్లను నిలిపివేసింది. ఈ భూములకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, అడంగల్ పత్రాలు, పాస్‌పుస్తకాలు వంటివి ఉన్నా సరే.. పాలకుల నిర్ణయాల వల్ల సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యను పరిష్కరిస్తుందని వారు ఆశించారు. కానీ రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఈక్రమంలో తాజాగా పెదవేగి మండలానికి చెందిన కొందరు.. కోర్టు అనుమతితో భూములను రిజిస్టర్ చేయించుకున్నారు. అయితే ఈ సమస్య ఎదుర్కొంటున్న అందరూ ఇలా కోర్టుకు వెళ్లడం సాధ్యం కాదు. కనుక ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.పెదవేగి మండలంలోనే అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటుంది. ఈ భూముల సమస్యలను పరిష్కరించాలని బాధితులు పీజీఆర్ఎస్‌లోనూ విన్నవించుకున్నారు. అయినా ప్రయోజనం లేదని తెలుస్తోంది. ఈ భూములపై ప్రతి వారం కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. సరైన పత్రాలు ఉన్న భూములను ఈ జాబితా నుంచి తొలగిస్తామని వెల్లడిం చారు. వాటి క్రయ, విక్రయాలకు అవకాశం కల్పిస్తున్నామని.. ఈ మేరకు తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చామని వారు పేర్కొన్నారు

## పిడిఎఫ్ బియ్యం గుర్తించేందుకు 700 రాపిడ్ టెస్టింగ్ మొబైల్ కిట్లు

**విజయవాడ :** రాష్ట్రంలోని వేర్వేరు పోర్టుల ద్వారా పిడిఎఫ్ బియ్యం.. విదేశాలకు తరలిపోతోంది. పౌరసరఫరాల అధికా రుల తనిఖీల్లో అనేక సందర్భాల్లో ఈ విషయం బయట పడింది. కేసులు కూడా పెట్టారు. కాకినాడ పోర్ట్ లో రేషన్ బియ్యం వ్యవహారంలో సిట్ ఎంక్వయిరీ కూడా నడుస్తోంది. ఇక విశాఖ పోర్టు నుంచి కూడా బియ్యం విదేశాలకు తరలిపోతుందనేది పౌరసరఫరాల శాఖ గట్టిగా నమ్ముతుంది. ఇటీవల తరలించేందుకు గోడౌన్లో సిద్ధంగా ఉంచిన బియ్యన్ని కూడా అధికారులు గుర్తించారు. ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్‌మెంట్ ను మరింత పటిష్టం చేశారు.నిఖీ చేస్తున్న సమయంలో ఆ బియ్యంపై అనుమానం వస్తే వాటిని ల్యాబ్ కు పంపి పరీక్షలు చేసిన తర్వాత మాత్రమే వాటిపై ఒక నిర్ధారణకు రావాల్సి ఉంటుంది. ఆ రిపోర్టు వచ్చేలోగా ఈ రవాణా సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయి అనేది.. గతంలో అనేకమంది ఎగుమతిదారులు పౌరసరఫరాల మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అయితే.. వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం సంస్కరణలు తీసుకువచ్చింది.. బియ్యం పై అనుమానం వచ్చిన వెంటనే చెక్ చేసి అప్పటికప్పుడు నిర్ధారించుకునేలా ఓ సరికొత్త ప్రణాళికనూ సిద్ధం చేసింది ప్రభుత్వం. పౌరసరఫరాల శాఖ ప్రత్యేక మొబైల్ ర్యాపిడ్ కిట్లను రంగంలోకి దింపింది. 700 రాపిడ్ టెస్టింగ్ మొబైల్ కిట్లను సిద్ధం చేసింది. వాటిని పౌరసరఫరాల శాఖ అధికారులకు నుంచి ఎన్ఫోర్స్మెంట్ పటిష్టం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్..పౌరసరఫరాల శాఖలో గత సంవత్సర కాలంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా నాణ్యమైన పోర్టిఫైడ్ రైస్ ప్రజలకు అందిస్తున్నందని.. ప్రభుత్వం అందించే బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పిడిఎస్ బియ్యం అవునో కాదో గుర్తించడానికి 700 మొబైల్ రాపిడ్ కిట్స్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ రాపిడ్ కిట్లలో పొటాషియం థయో సైనైడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ బాటిల్స్ ఉంటాయని అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పోర్టిఫైడ్ రైస్ అయినట్లయితే.. ఈ ద్రావణాలు ఆ బియ్యంపై చల్లితే అవి ఎరుపు రంగుకు మారుతాయని.. బయట దుకాణాల్లో అమ్మే బియ్యం అయితే రంగు మారవు అని తెలిపారు. గతంలో అయితే అక్రమ బియ్యం పట్టుకున్న తర్వాత ల్యాబ్ కి పంపించడం వలన సమయం ఎక్కువగా తీసుకోవడం కోర్టులో నిరూపణ కష్టమయ్యేదని.. ఈ రాపిట్ కిడ్స్ వల్ల వెంటనే గుర్తించడానికి.. సీజ్ చేయడానికి వీలు కలుగుతుందన్నారు మంత్రి.ఎన్ఫోర్స్మెంట్లో రాజీ పడేది లేదని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని.. అవకతవకలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే పౌర సరఫరాల విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నామన్నారు. బియ్యం తీసుకొచ్చే వాహనాలను నిరంతరం తనిఖీ చేయడానికి విశాఖ పోర్టు ప్రాంతంలో మూడు అంతర్గత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గాజువాక గేట్ వే సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, శ్రవణ్ సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, బిపిఎల్ ఇంటిగ్రల్ సి.ఎఫ్.ఎస్. పెదగంట్యాడ లలో మూడు చెక్పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే అవి పని చేయడం ప్రారంభించాయని చెప్పారు. కాకినాడ పోర్టులో గతంలో జరిగిన అక్రమ రవాణా జరిపిన వారిపై చట్ట పరమైన చర్యలు.. వాహనాలు సీజ్ చేయడం జరిగిందని అన్నారు. మన దేశానికి సంబంధించిన పీడీఎస్ రైస్ మన పోర్టుల నుండి అక్రమ రవాణా జరగకూడదని.. అందుకే చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని.. ఈ విధానం కాకినాడలో విజయవంతంగా అమలు చేశామన్నారు.

## ‘ఆ భయంతోనే చంద్రబాబు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు’

-మొదటిపేజీ తరువాయి

వస్తుంది, జోగి రమేష్ పేరు చెబుతాడు.. అతను చెప్పినందుకే చేశానంటాడు, నకిలీ మద్యం కేసులో చంద్రబాబు అడ్డం దొరికారు. ఆ భయంతో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. బెల్ట్ షాప్‌లు ఉన్నాయని చంద్రబాబే ఒప్పుకున్నారు.. కల్తీ మద్యాన్ని అసలు మద్యంలా చూపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు పెట్టాం.. ఆ దుకాణాలకు వచ్చిన మద్యం ఏ డిస్టిలరీ నుంచి వచ్చిందో తెలుసేలా చేశాం. దాని అమ్మకం జరిగితేనే డిస్టిలరీకి డబ్బులు వెళ్ళే విధంగా క్యూఆర్ కోడ్ పెట్టాం. పక్కాగా పకడ్బందీగా లిక్కర్ సేల్స్ జరిగాయి. టీడీపీ ప్రభుత్వం కల్తీ మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారు. 24 గంటలు బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లు పెట్టి నకిలీ మద్యం ఏరులై పారిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ధీటుగా ఎదుర్కోవాలి. 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి. ఎన్ని కష్టాలు ఎదురైనా ఉవ్వెత్తున ఎగిసి పడి మనం పోరాటాలు చేస్తున్నాం. చంద్రబాబు గ్యాంగ్ బరితెగించి అడ్డగోలుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాలి. పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం అయ్యేలా యాప్‌ను కూడా సిద్ధం చేశాం.. డేటా ప్రొఫైలింగ్ జరుగుతుంది. స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా పూర్తిస్థాయిలో సిద్దంగా ఉండాలి. పార్టీ కమిటీలు, సంస్థాగత నిర్మాణం విషయంలో పుంగనూరు, మడకశిర నియోజకవర్గాలను మోడల్ గా తీసుకుని ముందుకెళ్ళాలి. మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహిస్తే నష్టమని చంద్రబాబు అంటున్నారు పీపీపీలో మెడికల్ కాలేజీలు మంచిదని చెబుతున్నాడు.. ఇంతకంటే దారుణం ఇంకేమైనా ఉంటుందా?’ అని సజ్జల ప్రశ్నించారు.

## ఏఐతో విక్షిత్ భారత్‌కు ముందడుగు

-మొదటిపేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు బ్రాండ్, నాలుగు దశాబ్దాల దార్శనిక అనుభవానికి స్పష్టమైన నిదర్శనమని ప్రశంసిం చారు పవన్ కల్యాణ్. భారత్‌లో ఏఐ హబ్‌ను నిర్మించడానికి ప్రతి పౌరుడి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఈ సాంకేతికతను ఉపయోగించుకోవడానికి ఇది మన సమష్టి క్షణమని తెలిపారు. ప్రభుత్వంతో పాటు, ఈ కొత్త పురోగతి యుగానికి మనమందరం అవసరమని వివరిం చారు. యువత ఆవిష్కరణలు చేయడం, పరిశోధన చేయడం, పరిశ్రమ స్థాయిని పెంచడం ద్వారా అందరం కలిసి మన భవిష్యత్తును సరికొత్తగా నిర్మించుకుందామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## 299 చెరువులకు కృష్ణా జలాలు

-మొదటిపేజీ తరువాయి

అందరినీ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. చివరన ఉన్న కుప్పం వరకు కష్ణాజలాలు తరలి వెళ్ళడంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. రాయలసీమకు గుండెకాయ అయిన హంద్రీనీవా ప్రాజెక్ట్ ని గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం ఆటకెక్కించింది అన్నారు. ఆ ప్రభుత్వం ఐదేళ్లలో చేయనిది, కూటమి ప్రభుత్వం సంవత్సరంలో చేసి చూపించిందని రామానాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లన్ని 961 టిఎంసిల సామర్థ్యం ఉంటే 844 టీఎంసీలతో వాటిని నింపగలిగామన్నారు. అంటే 87.86% నీటిని నిల్వ చేయగలిగామని వివరించారు. అలాగే రాయలసీమలోని మొత్తం 38 నియోజకవర్గాల పరిధిలో హంద్రీనీవా ప్రాజెక్టు కాలువలు విస్తరించి ఉన్నాయి అన్నారు. ఈ కాలువలకు అనుబంధంగా 517 చెరువులు ఉన్నాయి. వీటిలో 174 చెరువులు పూర్తిగా, 125 చెరువులు పాక్షికంగా అంటే మొత్తం 299 చెరువులు నింపగలిగామన్నారు. మిగిలినవి ప్రాధాన్య క్రమంలో ఫిబ్రవరి మాసానికల్లా నింపుతామన్నారు. సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ప్రాజెక్టు సిఈలు కబీర్ భాషా నాగరాజు, ఎస్ఈలు, ఈఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పాలిటిక్స్‌లోకి షర్మిళ కుమారుడి ఎంట్రీ..



**కడప :** ప్రతి రాజకీయ నాయకుడు తన వారసత్వాన్ని అందించే ప్రయత్నం చేస్తారు. ఎందుకంటే రాజకీయం అంటే గౌరవంతో కూడిన ఒక రకమైన వ్యాపారం కూడా. అయితే బడా నాయకుల వారసత్వం విషయంలో పెద్దపెద్ద కుటుంబాల మధ్య గొడవ జరగడం అనేది సర్వసాధారణం. అటువంటి పరిస్థితి వైయస్ రాజశేఖర్ రెడ్డికుటుంబానికి ఎదురైంది. తండ్రి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీతో విభేదించి సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి పదవిని కూడా అలంకరించారు. మరోవైపు కుమార్తె షర్మిల సైతం తెలంగాణలో తండ్రి పేరుతో పార్టీని ఏర్పాటు చేశారు. వర్కౌట్ కాకపోవడంతో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు తీసుకున్నారు. సోదరుడు జగన్మోహన్ రెడ్డితో విభేదిస్తూ ముందుకు సాగుతున్నారు షర్మిల.మొన్న ఆ మధ్యన షర్మిల తన కుమారుడు రాజారెడ్డిని తన వెంట తీసుకొచ్చారు. దీంతో రాజారెడ్డి పొలిటికల్ ఎంట్రీ ఉంటుందని ప్రచారం ప్రారంభం అయింది. దానిపై షర్మిల మాట్లాడుతూ కచ్చితంగా రాజారెడ్డి రాజకీయాల్లోకి వస్తారని తేల్చి చెప్పారు. వస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా రాజశేఖర్ రెడ్డి నిజమైన వారసుడు తన కుమారుడు అని ప్రకటించారు. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌంటర్ ఇవ్వడం ప్రారంభించారు. రాజశేఖర్ రెడ్డి నిజమైన వారసుడు జగన్మోహన్ రెడ్డి అని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి జగన్మోహన్ రెడ్డికి అధికారం కట్టబెట్టిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. షర్మిల కుమారుడికి ఆ అవకాశం లేదని తేల్చి చెప్పారు. దీనిపై చాలా రోజులపాటు వాదనలు కొనసాగాయి. మీడియాలో డిబేట్ లు కూడా జరిగాయి.రాజశేఖర్ రెడ్డి వారసత్వం విషయంలో షర్మిల నుంచి తనకు సవాళ్లు ఎదురవుతాయని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. ఇప్పటికే పొలిటికల్ గా ఆమె చాలా డామేజ్ చేశారు. వారసత్వ రాజకీయాల విషయానికి వచ్చేసరికి షర్మిల కుమారుడు రాజారెడ్డి తెరపైకి వస్తే.. తన రాజకీయ వారసత్వం కనుమరుగవుతుందని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. అందుకే తన కుమార్తెలను రాజకీయాల్లోకి తెస్తారని ప్రచారం ప్రారంభం అయింది. అయితే ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు ఎలా ఉన్నాయో ఇంకా బయటపడలేదు. కానీ రాజకీయంగా తన వారసత్వం ఉండాలని ఆయన కోరుకుంటారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. పైగా కుమార్తెలను రాజకీయాల్లోకి తీసుకురావడం ఇది కొత్త కాదు. గతంలో చాలామంది నేతలు ఇలానే వచ్చారు.వచ్చే ఎన్నికల్లో కడప నుంచి అవినాష్ రెడ్డిని తప్పిస్తారని ప్రచారం ఉంది. ఆయనకు బదులు జగన్మోహన్ రెడ్డి కుమార్తెల్లో ఒకరిని పోటీ చేయిస్తారని సోషల్ మీడియాలో అయితే ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి జగన్మోహన్ రెడ్డి కుమార్తెల గురించి సమాచారం ఇప్పుడు బయటకు వచ్చినా సందర్భాలు లేవు. ప్రస్తుతం ఆ ఇద్దరు పిల్లలు చదువు పూర్తి చేసుకుని లండన్ లోనే ఉంటున్నారు. అయితే రాజశేఖర్ రెడ్డి ఉన్నంతవరకు ఆ కుటుంబంలో మహిళలు రాజకీయాల్లోకి రావడం అరుదు. కేవలం రాజకీయ వేదికలపై కనిపించేవారు. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో ఆ ఇంటి మహిళలు బయటకు వచ్చారు. రాజకీయాల్లో కనిపిస్తున్నారు. ఇప్పుడు వారసత్వ రాజకీయం పుణ్యమా అని జగన్మోహన్ రెడ్డి కుమార్తెల పేరు వినిపిస్తోంది. మరి అందులో ఎంత నిజం ఉందో తెలియాలి.

## డాక్యుమెంట్ రైటర్లను బ్రోకర్లనీ సంబోధించడం బాధాకరం.

### తిరుపతి జిల్లా అధ్యక్షుడు కేశవులు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్14 :**
సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుమలేష్ డాక్యుమెంట్ రైటర్లను దళారులంటూ సంబోధించడాన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని తిరుపతి జిల్లా డాక్యుమెంట రైటర్ల సంఘం అధ్యక్షుడు కేశవులు నాయుడు మండిపడ్డారు. మంగళవారం పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు కేశవులు నాయుడు మీడియాతో మాట్లాడుతూ అటెండర్ తిరుమలేశు తిరుపతిలో విధులు నిర్వహిస్తున్నప్పుడు అక్కడ కూడా డాక్యుమెంట రైటర్లపై దౌర్జన్యం చేసేవాడని గుర్తు చేశారు. డాక్యు మెంట్ రైటర్లు సబ్ రిజిస్టర్ కార్యాలయం లోకి వెళ్లవచ్చునని కోర్టు ఉత్తర్వులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. మనది ఒక వ్యవస్థ కుటుంబం కదా అని సర్దుకు పోయిన అటెండర్లో మాత్రం మార్పు రావడంలేదని తెలిపారు. అతను ఎక్కడ విధులు నిర్వహించిన డాక్యుమెంట్ రైటర్ లను దూషిస్తాడన్నారు. డాక్యుమెంట్ రైటర్లు ప్రజలకు సాధారణ రుసుముతో సేవ చేస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులకు తెలియజేసిన పట్టించుకోవడంలే దని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో లంచాలు గురించి మాట్లాడాల్సిన అవసరం అటెండర్‌కు ఏం అవసరం అని మండిపడ్డారు. జిల్లా ఉన్నతాధికారులు అటెండర్ తిరుమలేష్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు రమేష్,భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

## షాదీఖానా చైర్మన్‌ను సత్కరించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 14:**



కుప్పం షాదీ ఖానా చైర్మన్‌గా సీనియర్ టిడిపి నేత సర్దార్ బాష నియమితులయ్యారు. షాదీ ఖానా చైర్మన్‌గా నియమితులైన సర్దార్ బాషను టిడిపి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ముందుగా తనను నమ్మి పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నంకు, కుప్పం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు జాకీర్ అహ్మద్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనను సన్మానించి అభినందనలు తెలిపిన టిడిపి కుటుంబ సభ్యుల అభిమానాన్ని ఎన్నటికీ మరిచిపోలేమని, పార్టీ అధినేత నమ్మకాన్ని కాపాడుకుంటూ, సాటి నాయకుల అభిమానాన్ని నిలుపుకునేలా తమ పదవీ బాధ్యతలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షాది మహల్ డైరెక్టర్లు అబ్దుల్ గఫ్ఫార్, షానాజ్, ఫరూక్, ముద్దర్, టిడిపి నేతలు అన్సర్, ఇర్ఫాన్, ఉమర్, గని తదితరులు పాల్గొన్నారు.

### లిక్కర్ మంత్రి లిక్కర్ ద్వారా

# 400 కోట్లు వాటా వచ్చింది నిజం కాదా

**కార్వేటినగరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**
లిక్కర్ మంత్రి మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి లిక్కర్ ద్వారా 400 కోట్లు వాటా వచ్చింది, నిజం కాదా అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. మంగళవారం కార్వేటి నగరం మండలం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ విలేకరుల సమావేశం. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నియోజకవర్గ ఇన్చార్జి కృపా లక్ష్మి పై హాట్ కామెంట్ చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కల్తీ లిక్కర్‌పై మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపా లక్ష్మి మాట్లాడడం గంగాధర నెల్లూరు నియోజకవర్గ ప్రజలు జీర్ణించుకోలేరు మీరు చేసిన కల్తీ సారా అరాచకాలు దౌర్జన్యాలు దోపిడీలు మర్చిపోయారా, పోలీసులను పెట్టుకొని ఎర్రచందనం అక్రమ రవాణా చేయలేదా.. గ్రవెల్ ఇసుక అన్ని దందలు నడిచింది. మీరే 3500 కోట్లు లిక్కర్ స్కామ్ చేసింది. నారాయణ స్వామి అండ్ టీం సిట్ అధికారులు మీ ఇంటికి వస్తే నీ మేకప్ కరిగి పోలేదా సిట్ అధికారులు కాళ్లపైన సాష్టాంగగా పడిపో లేదా లిక్కర్ మంత్రిగా నారాయణస్వామి వాట 400 కోట్లు వచ్చింది. నిజంకాదా మీకు మీ ఇద్దరు చెల్లెళ్లకు వాటా ఇచ్చింది. నిజం కదా నీకు దమ్ముంటే లేదని చెప్పు కాణిపాకం రండి సత్యం చేయగలవా నువ్వు వేసుకున్న బంగారు నగలు.. బంగారు చైన్ కాలు గొలుసులు అంతా లిక్కర్ స్కామ్ లో వచ్చిన కమిషన్ కాదా.. అది కాదు అని దమ్ముంటే కాణిపాకంలో సత్యం చేసేయ్ అప్పుడు నియోజకవర్గంలో




నువ్వు ఏ బ్యానర్ అయినా వేసుకొని తిరగొచ్చు లిక్కర్ స్కామ్ లో వచ్చిన డబ్బులతో ప్రతి రెండు రోజులకు ఒకసారి తమిళనాడులోని పల్లిపట్టు సుమంగళి బంగారు అంగడిలో బంగారు నగలు డైమండ్..బంగారు బిస్కెట్స్ కొనింది. వాస్తవం కదా అని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి యుగంధర్ బిజెపి ఇన్చార్జ్ రాజేంద్రన్, కార్వేటి నగర్ మండల అధ్యక్షుడు చెంగల్రాయ్ యాదవ్ ఎమ్మెల్యే సోదరుడు రాజా, గంగాధర్ నెల్లూరు మండల అధ్యక్షుడు స్వామి దాస్, కార్వేటినగరం సహకార సంఘం అధ్యక్షుడు జనార్ధన్ రాజ్ టిడిపి యువ నాయకుడు మురళి రాజు,డిసిసిబి డైరెక్టర్ చంగల్రాయులు, గోపిశెట్టిపల్లి రాజా,సంధాని,రవి,యాదవ్, మాజీ ఎంపీపీ రవికుమార్,తోటి మురళి, కొత్తపల్లి టిడిపి యువనాయకుడు,దాసరి సతీష్,ఎస్ఆర్ పురం మండల సహకార సంఘం అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి,జీవన్ రెడ్డి,గజేంద్ర ఆర్టిఐ జిల్లా అధ్యక్షుడు జయరాజ్,గురునాథం,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు ఇక పీఎఫ్ నుంచి 100 శాతం తీసుకోవచ్చు

ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఈపీఎఫ్ఓ అదిరే శుభవార్త చెప్పింది. ప్రావిడెంట్ ఫండ్ ఖాతా నుంచి డబ్బులు ఉపసంహరణకు సంబంధించిన నిబంధనల సరళీకరణకు ముందుకొచ్చింది. ఇప్పుడు పీఎఫ్ ఖాతాదారులు ఉద్యోగి, యజమాని వాటా సహా పీఎఫ్ అకౌంట్లోని నిధుల్లో ఉపసంహరించుకోగల బ్యాలెన్సులో 100 శాతం విత్ డ్రా చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో జరుగుతోన్న ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఏడు కోట్లకు పైగా ఉన్న పీఎఫ్ ఖాతాదారులకు ప్రయోజనం కలగనుంది. ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఎఫ్ పాక్షిక ఉపసంహరణకు సంబంధించి 13 సంక్లిష్టమైన రూల్స్‌ను ఒకే నిబంధనగా క్రమబద్ధీకరించింది సీబీటీ. మూడు రకాలుగా విభజించింది. అందులో ముఖ్యమైన అవసరాలు (అనారోగ్యం, విద్య, వివాహం), గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులుగా వర్గీకరించింది. అలాగే పీఎఫ్ విత్ డ్రా పరిమితులను సైతం పెంచింది. పిల్లల చదువుల కోసం 10 సార్లు తీసుకోవచ్చు. అలాగే వివాహం విషయంలో 5 సార్లు వరకు పార్షియల్ విత్ డ్రాకుఅవకాశం కల్పిస్తోంది. ప్రస్తుత రూల్స్ ప్రకారం అయితే ఈ రెండు అవసరాలకు 3 సార్ల వరకే లిమిట్ ఉంటుంది. మరో కీలక నిర్ణయం తీసుకుంది.




అన్ని రకాల పాక్షిక ఉపసంహరణలకు పీఎఫ్ ఖాతాదారుల కనీస సర్వీసును ఏడాదికి (12 నెలలకు) తగ్గించింది. గతంలో ప్రత్యేక పరిస్థితులు ఆప్షన్ కింద పార్షియల్ పీఎఫ్ విత్ డ్రాకు నిరుద్యోగం, పకృతి విపత్తులు, కంపెనీల మూసివేత వంటి కారణాలు మాత్రమే చూపాల్సి ఉండేది. కానీ ఇప్పుడు ఎలాంటి కారణాలు చెప్పాల్సిన అవసరం లేదు. కారణాలు లేకుండానే దరఖాస్తు చేసుకుని పీఎఫ్ విత్ డ్రా చేసుకోవచ్చు. అలాగే పీఎఫ్ అకౌట్లో జమ చేసే మొత్తంలో 25 శాతాన్ని కనీస బ్యాలెన్స్‌గా ఉంచేలా రూల్ తీసుకొచ్చారు. తద్వారా ఈపీఎఫ్ఓ అందించే అధిక వడ్డీ (ప్రస్తుతం 8.25 శాతం) ద్వారా పెద్ద మొత్తంలో పదవీ విరమణ ప్రయోజనాలు పొందేందుకు దోహదపడుతుంది.

## స్పోర్ట్స్

# విండీస్‌పై రెండో టెస్టులో విజయం..

# సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన భారత్

**ఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 121 పరుగుల లక్ష్యఛేదనలో 63/1తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన టీమ్ఇండియా మరో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కేఎల్ రాహుల్ (58లిబీ 108 బంతుల్లో.. ఓవర్‌నైట్ స్కోరు 25) హాఫ్ సెంచరీతో మెరిశాడు. సాయి సుదర్శన్ (39బీ 76 బంతుల్లో) ఓవర్‌నైట్ స్కోరుకు మరో 9 పరుగులు జోడించి ఔటయ్యాడు. స్లిప్‌లో షై హోప్ స్టన్నింగ్ క్యాచ్ (రోస్టన్ ఛేజ్ బౌలింగ్) అందుకోవడంతో సుదర్శన్ వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్ (13బీ 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఛేజ్ బౌలింగ్‌లోనే గ్రీవ్స్‌కు చిక్కాడు. ధ్రువ్ జురెల్ (6లి) నాటౌట్‌గా నిలిచాడు. యశస్వి జైస్వాల్ (8)ని వారికన్ నాలుగో రోజే ఔట్ చేసిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేసింది. యశస్వి జైస్వాల్ (175), శుభ్‌మన్ గిల్ (129లి), ధ్రువ్ జురెల్ (44), నితీశ్ రెడ్డి (43) అదరగొట్టారు. కుల్‌దీప్ యాదవ్ (5/82), జడేజా (3/46)



విజృంభించడంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో విండీస్ 248 పరుగులకే కుప్పకూలి 270 పరుగుల లోటుతో ఫాలో ఆన్‌లో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కరేబియన్ జట్టు గొప్పగా పోరాడింది. కాంప్‌బెల్ (115), షై హోప్ (103) సెంచరీలకు తోడు జస్టిన్ గ్రీవ్స్ (50లి), రోస్టన్ ఛేజ్ (40), జైడెన్ సీల్స్ (32) రాణించడంతో 390 పరుగులకు ఆలౌటైంది.

వెస్టిండీస్‌పై భారత్‌కు ఇది వరుసగా పదో టెస్టు సిరీస్ విజయం.

కుల్‌దీప్ యాదవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, రవీంద్ర జడేజా ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు.

## కెప్టెన్ టు కెప్టెన్.. హాఫ్ సెంచరీ తర్వాత వెనుదిరిగిన ఆటపట్టు

మహిళల వన్డే వరల్డ్ కప్‌లో రెండో విజయంపై కన్నేసిన శ్రీలంకకు కెప్టెన్ చమరి ఆటపట్టు (53) శుభారంభమిచ్చింది. విష్మీ గుణరత్నే(33 నాటౌట్)తో కలిసి న్యూజిలాండ్ బౌలర్లను దంచేసన ఆటపట్టు అర్ధ శతకంతో చెలరేగింది. ఆ తర్వాత గేర్ మార్చాలనుకున్న ఆమె వెనుదిరిగింది. కివీస్ కెప్టెన్ సోఫీ డెవినే ఓవర్లో సిక్సర్‌కు యత్నించి బౌండరీ వద్ద మ్యాడీ గ్రీన్ చేతికి చిక్కింది. దాంతో.. తొలి వికెట్ 101 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. గుణరత్నే జతగా హాసిన పెరీరా జట్టుకు భారీ స్కోర్ అందించే పనిలో ఉంది. 25 ఓవర్లకు శ్రీలంక స్కోర్.. 103-1. కొలంబోలోని ప్రేమదాస మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న శ్రీలంకకు అదిరే ఆరంభం లభించింది. న్యూజిలాండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న చమరి ఆటపట్టు (53), విష్మీ గుణరత్నే(33 నాటౌట్)లు పవర్ ప్లేలో రన్స్ జోడించారు. ఆ తర్వాత కూడా వైట్‌ఫెర్న్స్ బౌలర్లను విసిగించిన ఈ ద్వయం జట్టు స్కోర్ వంద దాటించింది. డెవినే ఓవర్లోనే ఫోర్, ఆపై రెండు పరుగులతో వన్డేల్లో 20వ డెవినే ఓవర్లోనే ఫోర్, ఆపై రెండు పరుగులతో వన్డేల్లో 20వ డెవినే ఓవర్లోనే ఫోర్, ఆపై రెండు పరుగులతో వన్డేల్లో 20వ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న ఆటపట్టు ఆ తర్వాతి ఓవర్లో వెనుదిరిగింది. సోఫీ డెవినే బౌలింగ్‌లో ఆఫ్‌సైడ్ పెద్ద షాట్ ఆడిన ఆటపట్టు.. బౌండరీ లైన్ వద్ద గ్రీన్ చేతికి దొరికింది. దాంతో.. వికెట్ కోసం నిరీక్షిస్తున్న కివీస్‌కు తొలి వికెట్ లభించింది.



## ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సార్‌కు ఎల్లప్పుడు రుణపడి ఉంటాం : గ్లోరీ ప్రియ



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**
గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్ట గ్రామానికి చెందిన గ్లోరీ ప్రియ అనే నేను నా కుమారుడికి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వేలూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాము మా కుమారుడు హాస్పిటల్ ఖర్చులకు చాలా ఖర్చు పెట్టేశాం. నేను గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సార్ కార్యాలయంలో కు వెళ్లాను అక్కడ నేను వెళ్లేసరికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సార్ పిఏ అక్కడున్న సిబ్బంది నాతో గౌరవంగా పలకరించి ఏమి కావాలి అని అడగడం వారు రిసీవ్ చేసుకునే విధానం చాలా బాగున్నాయి. అక్కడ వెళ్లిన వారికి వారి సమస్యలను పరిష్కరించడం కల్లారా చూసాను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సార్ సేవలు చాలా బాగున్నాయి.ఇలా సీఎం రిలీఫ్ ఫండ్ కావాలనే చెప్పడంతో వారు మెడికల్ బిల్లులంతా తీసుకొని సీఎం రిలీఫ్ ఫండ్ కోసం పంపడం జరిగింది నేడు నాకు లక్ష, అయిదు వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ రావడం, చాలా ఆనందంగా ఉంది. మా కష్టాలను గుర్తించి సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సార్‌కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని గ్లోరీ ప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి టిడిపి యువనాయకుడు దాసరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చదవండి
చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రిక

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143